## క్లుప్తంగా

### ఆర్టీసీ పార్శిల్ కార్యాలయంలో 19న వస్తువుల వేలం

**రాజమహేంద్రవరం సిటీ:** ఆర్టీసీ పార్శిల్ కార్యాలయంలో పార్శిల్ బుక్ చేసి.. విడిచిపెట్టిన వస్తువులను ఈ నెల 19న రాజమహేంద్రవరంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (కమర్షియల్) మాధవ్ గురువారం తెలిపారు. ఉదయం 10.30కు పార్శిల్ బుకింగ్ ఆఫీస్ వద్ద ఈ వేలం జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్నవారు బహిరంగ వేలంలో పాల్గొనవచ్చన్నారు.

### స్వతంత్ర హాస్పిటల్స్‌కు నాభ్ అక్రిడిటేషన్


నాభ్ ధ్రువపత్రం

**సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం):** స్వతంత్ర మల్టీ స్పెషాలిటీస్ హాస్పిటల్‌కు క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు చెందిన నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్–హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ (నాభ్) నుంచి అక్రిడిటేషన్ సర్టిఫికెట్ అందుకున్నట్లు స్వతంత్ర హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.వేణుగోపాల్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వంద పడకల సామర్థ్యంతో ఈ అక్రిడిటేషన్ ఈ ఏడాది మే 8 నుంచి 2029 మే 7 వరకు చెల్లుబాటు అవుతుందన్నారు. అక్రిడిటేషన్ స్టాండర్డ్స్ ఫర్ హాస్పిటల్స్ ఐదో ఎడిషన్ ప్రకారం, స్వతంత్ర హాస్పిటల్స్ తనిఖీల అనంతరం నాణ్యత, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉందని ధ్రువీకరించి ఈ అక్రిడిటేషన్ ఇచ్చినట్లు సూపరింటెండెంట్ తెలిపారు.

### దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి


నియామకపత్రం అందుకుంటున్న తిరుపతిరావు

**సీటీఆర్ఐ:** సమాజంలో దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని దివ్యాంగుల హక్కుల వేదిక జిల్లా గౌరవ అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన ముద్దాల తిరుపతిరావు అన్నారు. గురువారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద దివ్యాంగుల హక్కుల వేదిక ఆత్మగౌరవ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతిరావును నూతన గౌరవాధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లడమే కాకుండా, వాటిని పరిష్కరించే విధంగా కృషి చేస్తానన్నారు. తమకు రావాల్సిన సబ్సిడీతో కూడిన రుణాలు సాధిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు, ముత్యాల పోసికుమార్, దివ్యాంగులు పాల్గొన్నారు.

### ఒక్క హామీ అమలు చేయని చంద్రబాబు

డీసీసీ అధ్యక్షుడు విశ్వేశ్వరరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి

**రాజమహేంద్రవరం సిటీ:** అబద్ధపు హామీలతో కూటమి ప్రభుత్వం గద్దెనెక్కి ఏడాది పూర్తయినా ఒక్క హామీ కూడా అమలు చేయలేకపోయిందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సూపర్ సిక్స్ పేరుతో హామీలు ఇచ్చిన చంద్రబాబునాయుడు ఏడాది కాలం పూర్తయినా ఒక్క హామీని అమలు చేయలేకపోయారని ధ్వజమెత్తారు. నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి, తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు, గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఆర్థిక సాయం వంటి హామీలను నెరవేర్చకపోవడం దారుణమన్నారు. ఈ సమావేశంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సినిమాలు

| | |
|---|---|
| శ్యామల | : థగ్ లైఫ్ |
| సూర్య మినీ | : బల్లెరినా |
| సూర్య ప్యాలెస్ | : హౌ టు ట్రెయిన్ యువర్ డ్రాగన్ |
| స్వామి | : శ్రీశ్రీశ్రీ రాజావారు, ది హంటర్ |
| శివజ్యోతి | : కట్టప్ప జడ్జిమెంట్, పాపా(ఓ నాన్నా) |
| అనుశ్రీ | : హౌ టు ట్రెయిన్ యువర్ డ్రాగన్ |
| రాజా | : హౌ టు ట్రెయిన్ యువర్ డ్రాగన్ |
| ఊర్వశి | : అందాల రాక్షసి |
| మేనక | : పాడేరు 12వ మైలు, శుభం |
| రంభ | : ఫైనల్ డెస్టినేషన్ |
| అప్సర | : సింగిల్ |
| అశోక | : భైరవం |
| **నామవరం** | |
| వీఎస్ మహల్ | : హౌ టు ట్రెయిన్ యువర్ డ్రాగన్ |
| **ధవళేశ్వరం** | |
| మురళీకృష్ణ | : హౌ టు ట్రెయిన్ యువర్ డ్రాగన్ |
| **కడియం** | |
| వెంకటసూర్య | : హౌ టు ట్రెయిన్ యువర్ డ్రాగన్ |

# ఉపాధికి ఓకేషనల్

- అందుబాటులో వృత్తి విద్య కోర్సులు
- వివిధ విభాగాలపై ఆసక్తి చూపుతున్న విద్యార్థులు
- జీవితంలో స్థిరపడేందుకు దోహదం


ఎంపీహెచ్‌డబ్ల్యూలో శిక్షణ పొందుతున్న ఒకేషనల్ విద్యార్థులు

**కంబాలచెరువు:** మన ముంగిటే ఉపాధి బాట ఉంది. అది అందిపుచ్చుకుంటే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుంది. అవే వృత్తి విద్యా కోర్సులు. వీటిపై చాలా మందికి తక్కువ విద్య అనే అపోహ ఉంది. ఈ కోర్సులు పూర్తి చేసి, మంచి ఉద్యోగాల్లో స్థిరపడిన వారెందరో ఉన్నారు. వృత్తి విద్యా కోర్సులకు సంబంధించి ఉమ్మడి గోదావరి జిల్లాలకు కలిపి కాకినాడలో ప్రత్యేకంగా ఒక ప్రభుత్వ కళాశాలే ఉంది. రాజమహేంద్రవరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు, నివ్య ఒకేషనల్ జూనియర్ కళాశాలలున్నాయి. ఆయా కళాశాలల్లో వృత్తి విద్యా కోర్సులు బోధిస్తున్నారు.

**పది రకాల కోర్సులు**

ఆయా కళాశాలల్లో మొత్తం పది రకాల వృత్తి విద్యా కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఇందులో ఇంజినీరింగ్ గ్రూపులకు సంబంధించినవి కూడా ఉన్నాయి. వాటిలో మెకానికల్ అండ్ ఆటోమొబైల్ ఇంజినీరింగ్, కంప్యూటర్ ఇంజినీరింగ్, సివిల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, ప్రింటింగ్ టెక్నాలజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. అలాగే ఆర్ట్స్ విభాగంలో రెండు గ్రూపులు ఉన్నాయి. ఆఫీస్ అసిస్టెంట్ (ఓఏ), అకౌంట్స్ అండ్ టాక్సేషన్ (ఏటీ), పారామెడికల్ విభాగంలో రెండు కోర్సులు బోధిస్తున్నారు. ఎంపీహెచ్‌డబ్ల్యూ (మల్టీపర్పస్ హెల్త్ వర్కర్) ఫిమేల్, ఎంఎల్టీ (ల్యాబ్ టెక్నీషియన్), హోమ్ సైన్స్ హోటల్ మేనేజ్‌మెంట్ విభాగాలు ఉన్నాయి.

**తక్షణ ఉపాధి**

ఇంటర్‌లో వృత్తివిద్యా కోర్సులు పూర్తి చేసిన వెంటనే ఉపాధి దొరుకుతుంది. బాలికలు ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సు చదివితే ఏఎన్ఎంలు, నర్సులుగా ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో స్థిరపడవచ్చు. ఈ గ్రూపుల్లో విద్యా బోధనకు కళాశాలలో నిష్ణాతులైన అధ్యాపకులు సబ్జెక్టుకు ఇద్దరేసి చొప్పున ఉన్నారు. రెండేళ్ల కోర్సులో ఓ ఏడాది అప్రెంటీస్‌షిప్ ఉంటుంది. మార్కుల లిస్టుతో పాటు ఇచ్చే ఆ ధ్రువపత్రం ఉద్యోగ సమయంలో చాలా ఉపయోగపడుతోంది. ఇంటర్ జనరల్ విభాగం మాదిరిగా కాక మొత్తం వెయ్యి మార్కులు ఉండగా, వాటిలో 500 ప్రాక్టికల్, 500 థియరీ విభాగాలకు ఉంటుంది. ఇక ఇంజినీరింగ్ విభాగంలో ఏదైనా కోర్సు పూర్తి చేస్తే పాలిటెక్నిక్ రెండో ఏడాదిలోకి నేరుగా ప్రవేశించే వెసులుబాటు కలుగుతుంది. రాజమహేంద్రవరం ప్రభుత్వ కళాశాలలో ఒకేషనల్ విభాగంలో గ్రూపునకు 30 చొప్పున సీట్లు కేటాయించారు. అంటే 10 గ్రూపులకు 300 మంది ఒకేషనల్ విద్యార్థులు ఉండాల్సి ఉండగా, అది 400 వరకూ పెరుగుతోంది.

**ఉత్తమ ఫలితాలు**



వృత్తి విద్యా కోర్సులు చేసిన విద్యార్థులు జీవితంలో మంచిగా స్థిరపడవచ్చు. ఇది కష్టమైన విద్య కాదు. మేథస్సుకు పదును పెడితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు. ఈ కోర్సులు పూర్తి చేసిన వారు వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. ఇంటర్ వృత్తి విద్య కోర్సుల్లో చేరేందుకు ప్రవేశాల గడువు ముగుస్తుంది.

– పి.శ్రీనివాసరెడ్డి, ఒకేషనల్ డీన్, ప్రభుత్వ కళాశాల, రాజమహేంద్రవరం

**ఉపాధి అవకాశాలు**



వృత్తి విద్యా కోర్సులు పూర్తి చేసిన తర్వాత చక్కని ఉపాధి అవకాశాలు ఉంటాయి. వాటిని సరైన రీతిలో సద్వినియోగం చేసుకుంటే మంచి స్థానంలో స్థిరపడవచ్చు. ఇందులో కొన్ని కోర్సులు చదువుకుంటూనే ఉపాధి వేతనం పొందవచ్చు. దీనికి ఎంఎల్టీ కోర్సు ఉదాహరణ. ఇంజినీరింగ్ విభాగంలో పలు కోర్సులు ఉన్నాయి. వీటిని పూర్తి చేస్తే నేరుగా పాలిటెక్నిక్ రెండో సంవత్సరంలోకి అడుగు పెట్టవచ్చు. అలాగే ఎంసెట్ రాయవచ్చు.

– పి.ఎర్నెస్ట్ మోజెస్, నివ్య ఒకేషనల్ కళాశాల, రాజమహేంద్రవరం

### నేడు యోగాంధ్ర మాక్ డ్రిల్

డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వరరావు


డాక్టర్ వెంకటేశ్వరరావు

**రాజమహేంద్రవరం రూరల్:** యోగాంధ్రలో భాగంగా జిల్లా యంత్రాంగం శుక్ర, శని వారాల్లో ఉదయం 5:30 గంటలకు రాజమహేంద్రవరంలోని ఆర్ట్స్ కళాశాల సమీపంలో యోగాంధ్ర మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నట్టు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజమండ్రి అర్బన్‌లోని యూపీహెచ్‌సీల పరిధిలోని వైద్యాధికారులు, పారా మెడికల్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు యోగాంధ్ర కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. వైద్యారోగ్య శాఖ వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, కార్యాలయ సిబ్బంది, ప్రోగ్రాం అధికారులు పట్టణ సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల సమీపంలో గ్రాండ్ ట్రంక్ రోడ్డులో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు.

### పంచాయతీ కార్యదర్శుల బదిలీలు

**కడియం:** మండలంలోని పలు పంచాయతీల కార్యదర్శులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. పలువురు పంచాయతీ కార్యదర్శులు వివిధ గ్రేడ్లలో పనిచేస్తున్నారు. ఏ గ్రేడు కార్యదర్శి ఆ గ్రేడు పంచాయతీలోనే పనిచేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడంతో ప్రస్తుత బదిలీలు జరిగాయి. వీరవరం పంచాయతీ కార్యదర్శి ఆర్‌వీ లక్ష్మి కోనసీమ జిల్లా అల్లవరం మండలం గూడాలకు బదిలీపై వెళ్లారు. దుళ్ల కార్యదర్శి జి.రవికిశోర్‌ను మండలంలోని పొట్టిలంకకు బదిలీ చేశారు. అనపర్తి మండలం మహేంద్రవాడ నుంచి బి.సత్యానంద్‌కుమార్ బదిలీపై దుళ్లకు వచ్చారు. జేగురుపాడు కార్యదర్శిగా పనిచేసిన ఎస్.సత్తిబాబును వీరవరం పంచాయతీకి బదిలీ చేశారు. పొట్టిలంక కార్యదర్శి ఎస్‌కే బాషా రాజానగరం మండలం గాడాలకు బదిలీ అయ్యారు. మండలంలోని 11 పంచాయతీలకుగాను తొమ్మిది పంచాయతీలకు పూర్తిస్థాయి కార్యదర్శులు వచ్చారు. కడియపులంక పంచాయతీకి ఎవ్వరూ రాకపోవడంతో, సచివాలయం-4 కార్యదర్శిగా పనిచేస్తున్న సుస్మిత జోన్స్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. మాధవరాయుడుపాలేనికి సైతం ఇన్‌చార్జి కార్యదర్శినే కేటాయించారు.

## జాతీయ పురస్కారానికి కేంద్ర బృందం పరిశీలన


హెడ్ వాటర్ వర్క్సును పరిశీలిస్తున్న కేంద్ర బృంద సభ్యులు

**రాజమహేంద్రవరం సిటీ:** నీటి నిర్వహణలో నగర పాలక సంస్థ అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్నట్లు కేంద్ర జల వనరుల శాఖ బృంద సభ్యులు సుమన్, లక్ష్మీనారాయణ తెలిపారు. గురువారం నగరంలోని వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, సివేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, కంబాలచెరువు, ఇంకుడు గుంతలను బృంద సభ్యులు పరిశీలించారు. నగరపాలక సంస్థ పరిధిలో నీటి నిర్వహణ పనులను ఆరో జాతీయ జల పురస్కారానికి ఎంపిక చేయడానికి పరిశీలిస్తున్నట్లు వారు వెల్లడించారు. జల కాలుష్య నివారణ, నీటిని పొదుపు చేయడం, పర్యావరణ వ్యవస్థను పునరుద్ధరించడం తదితర అంశాలకు ప్రాధాన్యం ఇస్తారని వివరించారు. ముఖ్యంగా భూగర్భ జలాల పెంపు కోసం నగరపాలక సంస్థ చేపడుతున్న పనులు అభినందనీయమన్నారు. ఈ పనులను పూర్తిస్థాయిలో పరిశీలించిన తర్వాత కేంద్రానికి నివేదిక పంపి, అవార్డు కోసం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేస్తామన్నారు. బృందం వెంట కార్పొరేషన్ ఏఈలు వెంకటేష్, శ్రీధర్, నగరపాలక సంస్థ సిబ్బంది ఉన్నారు.

## స్టూడెంట్ కిట్ల పంపిణీ

**కంబాలచెరువు:** విద్యార్థులకు అందజేస్తున్న సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర స్టూడెంట్ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని కంబాలపేటలోని చున్నీలాల్ జాజూ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఆర్.సీతామహాలక్ష్మి అన్నారు. విద్యార్థులకు గురువారం పాఠ్య, నోటు పుస్తకాలు, యూనిఫాం గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పాఠ్య పుస్తకాలను సెమిస్టర్ల వారీగా, సబ్జెక్టుల వారీగా ఒక బుక్‌గా చేశారని చెప్పారు. ఎస్ఎంసీ చైర్‌పర్సన్ మహమ్మద్ హుమేరాబాను, ఐదో వార్డు ఇన్‌చార్జి బి.గిరిజ, ఇతర కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**పాఠ్య పుస్తకాల అందజేత**

**కడియం:** మండల కేంద్రమైన కడియంలోని ఏవీఆర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీని ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ గురువారం ప్రారంభించారు. హెచ్ఎం టి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ అధ్యక్షురాలు గారాపటి సత్య, ఎంఈవో వై.నాగేశ్వరరావు, స్టాఫ్ కార్యదర్శి గొల్లపల్లి సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నైపుణ్యాభివృద్ధి కో–ఆర్డినేటర్‌గా సంజీవరావు


ప్రిన్సిపాల్ నుంచి నియామక పత్రం అందుకుంటున్న సంజీవరావు తదితరులు

**సీటీఆర్ఐ:** ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉపాధి నైపుణ్యాభివృద్ధి, నియామక కేంద్రం సమన్వయకర్త (కో–ఆర్డినేటర్)గా తెలుగు అధ్యాపకుడు డాక్టర్ పీవీబీ సంజీవరావుని నియమిస్తూ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ తిరుపణ్యం గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, విద్యార్థి నైపుణ్య సామర్థ్యానికి అనుగుణంగా ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల్లో ఉద్యోగ సాధనే లక్ష్యంగా కళాశాలలో దీనిని ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. డాక్టర్ సంజీవరావు మాట్లాడుతూ, డిగ్రీ కోర్సులకు పెరుగుతున్న డిమాండ్‌ను బట్టి, యువతలో నైపుణ్యాలు పెంపొందించేలా ఏడాది పొడవునా పూర్తి స్థాయి శిక్షణ ఇస్తామన్నారు. సెంటర్ ఫర్ ఎంప్లాయిబిలిటీ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ప్లేస్‌మెంట్‌లో కార్యదర్శి డాక్టర్ వై స్వర్ణశ్రీ, ఎంఎస్ ఫణికుమార్, ఎం.లలితరమ్య, ఎస్.శివప్రసాద్, ఎస్.రాజ్‌కుమార్, విద్యార్థులు అనూష వర్ధిని, రిష్యేంద్ర గుప్తా సభ్యులుగా వ్యవహరిస్తారన్నారు. కమిటీ సభ్యులందరూ ప్రిన్సిపాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## పిల్లల స్వేచ్ఛ అందరి బాధ్యత

డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి


సమావేశంలో మాట్లాడుతున్న కార్యదర్శి శ్రీలక్ష్మి

**కంబాలచెరువు:** సమాజంలో పిల్లలందరికీ విద్య, స్వేచ్ఛగా జీవించే పరిస్థితులను కల్పించడం అందరి బాధ్యత అని డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఎస్.శ్రీలక్ష్మి అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినం సందర్భంగా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై గురువారం స్థానిక నారాయణపురం సచివాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆరు నుంచి 14 ఏళ్లున్న పిల్లలకు ఉచిత నిర్బంధ విద్య వారికి రాజ్యాంగ హక్కు అన్నారు. ఈ వయస్సు పిల్లలను కార్మికులుగా మార్చడం చట్టరీత్యా నేరమని, అలా చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. పిల్లల భద్రత దృష్ట్యా సంబంధిత అధికారులు, వ్యవస్థలు మరింత పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. పిల్లల కోసం అందుబాటులో ఉన్న ఉచిత న్యాయ సేవలను వివరించారు. ఎలాంటి న్యాయ సహాయం కావాలన్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో భాగంగా బాల కార్మికులను గుర్తించడానికి కొన్ని బృందాలను ఏర్పాటు చేసి, నగరంలో పలు ప్రాంతాల్లో తనిఖీలు చేసేందుకు ఆదేశాలు జారీ చేశారు. ఈ తనిఖీలకు సంబంధించిన నివేదికను జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కేఎస్ జ్యోతి, డిస్ట్రిక్ట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ బి.శశాంక, అర్బన్ తహసీల్దార్ సీహెచ్‌జీఆర్ పాపారావు, విద్యా శాఖ సెక్షన్ ఆఫీసర్ డి.ఎస్తర్‌రాణి, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు లలిత, ఎ.విజయ ప్రకాష్, షేక్ జబీనా, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ లీగల్ ఆఫీసర్ శ్రీగౌరి, పోలీసు అధికార్లు, లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

## మోగిన బడి గంట

నగరంలో పాఠశాలలు పునః ప్రారంభం

**కంబాలచెరువు:** నగరంలో బడి గంట మోగింది. వేసవి సెలవులు ముగిసి, పాఠశాలలకు నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైంది. ఉదయం 9 గంటలకు పాఠశాలలకు విద్యార్థులంతా చేరుకున్నారు. నగరంలోని 84 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ఒకటి నుంచి పదో తరగతి వరకు సుమారు 13 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. 125 ప్రైవేట్ విద్యాసంస్థల్లో సుమారు 45 వేల మంది విద్యనభ్యసిస్తున్నారు. యథావిధిగా 12.20కు మధ్యాహ్న భోజనాలు మొదలయ్యాయి. తొలిరోజు కావడంతో విద్యార్థులు ఉత్సాహంగా పాఠశాలలకు వచ్చారు. తాపీగా వంట పనులు పూర్తి చేసుకునే తల్లులకు.. స్కూళ్లు ప్రారంభం కావడంతో వంటింట్లో హడావిడి మొదలైంది. గబగబా పిల్లలకు బాక్సులు సర్దడం, స్కూలు బస్సుల వద్దకు వచ్చి పిల్లలను ఎక్కించడం, ఆటోల్లో విద్యార్థులు వెళ్లడం వంటి దృశ్యాలు కనిపించాయి. నగరంలోని చాలా వరకు పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాలు, ఇతర కిట్లను పంపిణీ చేశారు. విద్యార్థులు నూతన తరగతులకు వెళ్లడం, నూతన ఉపాధ్యాయులు పరిచయం చేసుకుని తొలిరోజు పాఠాల స్థానంలో సాధారణ విషయాలు, జోక్‌లతో ఆహ్లాదంగా గడపడం, పాఠశాలకు తల్లిదండ్రులు వచ్చి విద్యార్థుల కిట్లను అందుకోవడం వంటి వాటితో స్కూలు వాతావరణం సందడిగా కనిపించింది.


ఆర్యాపురంలోని నన్నయ మున్సిపల్ పాఠశాలకు వెళ్తున్న బాలికలు

## ‘పోతుల’ పేరుతో స్టేడియం ఆనందదాయకం

మంత్రి దుర్గేష్


స్టేడియం శంకుస్థాపన ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి దుర్గేష్ తదితరులు

**అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్):** తన తాతయ్య పోతుల వీరభద్రరావు పేరుతో స్టేడియంను పునరుద్ధరించడం ఆనందంగా ఉందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. గురువారం స్థానిక నాగులచెరువు బజార్‌లోని పోతుల వీరభద్రరావు మున్సిపల్ స్టేడియాన్ని స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ రూ.7 కోట్లతో క్రికెట్ స్టేడియంగా అభివృద్ధి చేసేందుకు రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆధ్వర్యంలో మంత్రితో పాటు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ, ఆంధ్ర రాష్ట్రంలో నాడు ప్రఖ్యాతిగాంచిన నింబుల్స్ ఎలెవన్ ఫుట్‌బాల్ ప్లేయర్లు సుంకర భాస్కరరావు, తన తాతయ్య పోతుల వీరభద్రరావు లాంటి క్రీడాకారులు ఈ స్టేడియంలో ఆడారని గుర్తుచేశారు. ఈ స్టేడియాన్ని త్వరితగతిన క్రీడాకారులకు అందుబాటులో తేవాలన్నారు. స్థానికంగా క్రికెట్ స్టేడియం ఏర్పాటుకు 12 ఎకరాల స్థలం అవసరమని, ఆ దిశగా ప్రయత్నం చేస్తున్నామన్నారు. త్వరలోనే కార్యరూపం దాల్చుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ, రాజమండ్రిలోని క్రీడాకారులకు క్రికెట్ స్టేడియం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ కేతన్ గార్గ్, ఏఎంసీ చైర్మన్ మార్ని వాసుదేవ్, కడియం ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు మత్సేటి ప్రసాద్, యామన నారాయణగౌడ్, మద్దా మణి, మజ్జి పద్మావతి, మాజీ కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

### కొత్తకాలనీలో గంజాయి బ్యాచ్‌ల హల్‌చల్!

సర్పంచ్‌కు మొరపెట్టుకున్న కాలనీవాసులు


గంజాయి బ్యాచ్‌ల ఆగడాలను వివరిస్తున్న కొత్తకాలనీ వాసులు

**కడియం:** మండలంలోని జేగురుపాడు పాములమెట్టపైనున్న కొత్తకాలనీలో గంజాయి బ్యాచ్ హల్‌చల్ చేస్తున్నట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం సర్పంచ్, వైఎస్సార్ సీపీ కడియం మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్‌కు కాలనీవాసులు మొరపెట్టుకున్నారు. పాములమెట్ట ఎస్టీ కాలనీలోని పంచాయతీ మోటారు, ప్రభుత్వ కాలనీలోని మోటారు వైర్లతో సహా, ఆరుగురు రైతులకు చెందిన మోటార్ల వైర్లు కత్తిరించుకుపోయారన్నారు. దీంతో కాలనీలో రెండు రోజులుగా తాగునీరు అందక ఇబ్బందులు పడ్డామన్నారు. అంతేకాకుండా మోటారు సైకిళ్లు, సైకిళ్లు, ఆఖరికి కోళ్లు, మేకలను కూడా మాయం చేస్తున్నారన్నారు. గుంపులుగా తిరుగుతున్న వారిని ఎవరని ప్రశ్నిస్తే.. అడిగిన వారిపై తిరగబడుతున్నారని స్టాలిన్ దృష్టికి తీసుకువచ్చారు. కాయకష్టం చేసుకుని బతికే వారమని, వారిని ఎదిరించడానికి కాలనీవాసులు భయపడుతున్నారని వారు వివరించారు. గంజాయి బ్యాచ్‌ల ఆగడాలపై పోలీసులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని సర్పంచ్ స్టాలిన్ ఈ సందర్భంగా వారికి హామీ ఇచ్చారు.

## బాల్యం బడిలోనే భద్రం

అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు

**కంబాలచెరువు:** ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం, బాలకార్మిక వ్యతిరేక మాసం సందర్భంగా పోలీసు కార్యాలయంలో బాలలు పని చేయడం కాదు, చదువుకునే వాతావరణాన్ని సృష్టిద్దాం అనే పోస్టర్‌ను అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు గురువారం ఆవిష్కరించారు. చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్, ఏపీ ప్రో చైల్డ్ గ్రూప్, గోదావరి చైల్డ్ రైట్స్ ఫోరమ్ సంయుక్తాధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ, బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పనిలో కాకుండా, బడిలో చేర్పించేలా చూడాలన్నారు. పిల్లల బాల్యం బడిలో ఉండాలని కర్మాగారాల్లో కాదన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించాలని, పనుల్లో పెట్టరాదని కోరారు. పిల్లలను పనిలో పెట్టుకునే వారికి జరిమానాతో పాటు, జైలు శిక్ష కూడా ఉంటుందని హెచ్చరించారు. బాలల సంక్షేమానికి అనేక మంచి కార్యక్రమాలు అమల్లో ఉన్నాయన్నారు. బాలల హక్కుల పరిరక్షణకు పలు చట్టాలు ఉన్నాయని, పోలీస్, విద్యా శాఖలు సంయుక్తంగా పనిచేస్తున్నాయన్నారు.

కార్యక్రమంలో జాంపేట లూథరన్ ఎయిడెడ్ హైస్కూల్ కరస్పాండెంట్ ఎం.ఐజయ, హెచ్ఎం ఎస్.మేరీ పెరల్స్, జిల్లా వినియోగదారుల మండలి సభ్యులు గొట్టిముక్కల అనంతరావు, మార్టిన్ లూథర్‌కింగ్ జూనియర్ హ్యూమన్ రైట్స్ క్లబ్ సభ్యులు బషీరమ్మ, హారిక, హర్షిత, దైవదర్శిని, రుషేంద్ర, గోదావరి చైల్డ్ రైట్స్ ఫోరమ్ సభ్యులు టి.మార్టిన్ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

### ఉత్సాహంగా జోనల్ క్రీడా పోటీలు


వాలీబాల్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

**రాజమహేంద్రవరం రూరల్:** ఐసీఎస్‌సీఈ జోనల్–ఏ క్రీడా పోటీలు స్థానిక కవలగొయ్యి రోడ్‌లోని ఫ్యూచర్‌కిడ్స్ గ్లోబల్ స్కూల్‌లో గురువారం ఉత్సాహంగా జరిగాయి. జోనల్–ఏ స్థాయి క్రీడా పోటీలలో ఆర్చరీ, వాలీబాల్ పోటీల్లో తెలుగు రాష్ట్రాల నుంచి ఆరు పాఠశాలల క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచినవారు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రీజనల్ స్థాయిలో జరిగే సీఐసీఎస్‌సీఈ పోటీల్లో పాల్గొంటారని పాఠశాల డైరెక్టర్ యేలేటి రవిబాబు తెలిపారు. విజేతలను ఆయనతో పాటు, పాఠశాల చైర్‌పర్సన్ యేలేటి విజయకుమారి, సీఈవో శ్రీమహాశ్వి, ప్రిన్సిపాల్ శేషగిరిధర్, డీన్ హర్షిణి తదితరులు అభినందించారు.

### చెత్త నుంచి సంపద కేంద్రాలు వినియోగంలోకి తేవాలి

డిప్యూటీ ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి

**పెదపూడి:** పంచాయతీల్లో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు అన్ని వినియోగంలోకి తీసుకురావాలని డిప్యూటీ ఎంపీడీఓ మేడపాటి సత్యనారాయణరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా చేసి, తడి చెత్త నుంచి వర్మీ కంపోస్టు, పొడి చెత్తను రీసైకిల్ చేసి విక్రయించాలన్నారు. పంచాయతీల్లో సురక్షితమైన మంచినీటి సరఫరా చేయాలన్నారు. సూపర్ క్లోరినేషన్ చేసి, లీకేజీలు ఉంటే వెంటనే సరిచేయాలన్నారు. ఈ నెల 14న యోగాంధ్రాకు సంబంధించి ప్రతి గ్రామ పంచాయతీలో నిర్దేశించిన చోట్ల యోగా డెమో నిర్వహించాలన్నారు. స్వర్ణ గ్రామ పంచాయతీ యాప్‌లో ఇంటి పన్ను డిమాండ్ రిజిస్టర్ దాఖలు చేసి, ఆధార్ నంబర్లతో సహా ప్రతి ఒక్క అసెస్మెంట్ నూరు శాతం అప్‌లోడ్ చేయాలన్నారు. సమావేశంలో పంచాయతీల కార్యదర్శులు బి.ప్రసన్నకుమార్, కనక నాగేంద్ర, సబ్బెళ్ల కృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణ, జి.ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.